
# గాయత్రి



విశాఖపట్నం రామకృష్ణాబీచ్‌లో, చల్లటి గాలికి నల్లటి జుట్టు తన అందమైన నుదుటి మీద నాట్యం చేస్తుంటే, సుతారంగా తల పై కెగరేసి, కురులను సర్దుకున్నది గాయత్రి.

ఆమె వైపే కన్నార్పకుండా చూస్తున్నాడు నజీర్. సముద్రంలోని అలలు ఉవ్వెత్తుగా పై పైకి ఎగిరిపడుతున్నాయి. వీధి దీపాలు మసకచీకటితో పోట్లాడి, వెలుతురును వెదజల్లుతున్నాయి.

"ఏమిటి? అలా చూస్తున్నావ్?" అడిగింది గాయత్రి, తన అందమైన పెదాల మధ్య నుండి వెలువడుతున్న చిరునవ్వుని దాచిపెడుతూ.

"నిన్ను చూస్తూ, ఎన్నాళ్లయినా ఇలాగే కదలకుండా కాలం గడిపేయాలనివుంది" అన్నాడు నజీర్, ఆమె అందమైన కళ్ళనూ, ఆ కళ్ళల్లోని మెరుపునీ చూస్తూ.

"అలాగే! మరి నీ చదువేమవుతుంది? తిండి ఎవరు పెడతారు?" అడిగింది చిలిపిగా.

"మనల్ని పుట్టించిన దేవుడే! ఇంకెవరు" అన్నాడు నజీర్, ఆమె చేతిని తన చేతిలోకి

తీసుకుని నిమురుతూ.

ఆమె నవ్వింది.

"నువ్వంటే నాకు చాలాఇష్టం నజీర్! మనం పెళ్ళి చేసుకుందాం" అన్నది గాయత్రి.

నజీర్ ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు.

"ఏమంటావ్? మన పెళ్ళి నీకు ఇష్టమేనా?" అడిగింది గాయత్రి.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం గాయత్రీ.... కానీ.... ఈ మతాంతర వివాహానికి, మీవాళ్ళు.... అంగీకరిస్తారంటావా?"

"అంగీకరించరు" అన్నది గాయత్రి వెంటనే.

"మరి....?" గాభరాగా అన్నాడు నజీర్.

"మా వాళ్ళని ఒప్పించటానికి ప్రయత్నం చేస్తాను. వాళ్ళు అంగీకరించకపోతే బాధపడతాను కానీ, భయపడను. నా జీవితానికి సంబంధించిన విషయం ఇది. నేనే నిర్ణయం తీసుకోవాలి. తీసుకుంటాను. మంచి జరిగినా, చెడు జరిగినా, నా జీవితానికి బాధ్యత వహించవలసింది నేనే కదా!" దృఢంగా అన్నది.

నజీర్ ఆమె చేతిని మృదువుగా వత్తి, ఆమె కళ్ళల్లోకి ప్రేమగా చూశాడు.

కొన్ని క్షణాలాగి అడిగింది గాయత్రి - "నజీర్! మరి మీవాళ్ళు, మన పెళ్ళికి ఒప్పుకుంటారా?"

"ఒప్పుకోరు. అయినా అడిగి చూస్తాను. రెండు రోజులు ఓపిక పట్టు...." అన్నాడు సాలోచనగా.

"ఒకవేళ వాళ్ళు అంగీకరించరనుకో! అప్పుడేం చేస్తావ్?" అడిగింది గాయత్రి.

"ఒప్పించటానికి గట్టి ప్రయత్నం చేస్తాను. వాళ్ళు ఒప్పుకోవాలికదా మరి" అన్నాడు నజీర్, ఆమెకు దగ్గరగా జరుగుతూ.

చటుక్కున తల ఎత్తి, దగ్గరగా వస్తున్న అతన్ని వింతగా చూసింది ఆమె.

"రెండు రోజులు ఆగమన్నానుకదా! నీకు ఎల్లుండి సాయంత్రం ఇదేచోట... అన్ని వివరాలూ చెబుతాను" అన్నాడు నజీర్, ఆమె భుజం మీద చేయి వేస్తూ.

గాయత్రి చిరునవ్వుతో, అతని చేతిని తొలగించి, లేచి నుంచున్నది.

"నేను ఇంక వెళ్ళాలి. నా రూమ్మేట్ గీత ఎదురు చూస్తుంటుంది" అన్నది.

"పద.... నా స్కూటర్ మీద వెడదాం, హాస్టల్ దగ్గర దించుతాను" అన్నాడు నజీర్, తను కూడా లేస్తూ.

★★★

ఆరోజు రాత్రి గీతతో అన్నది గాయత్రి, "నేను నజీర్‌ని పెళ్లి చేసుకుందామను కుంటున్నాను" అని.

గాయత్రి నజీర్‌ను ప్రేమిస్తున్న విషయం గీతకు ముందే తెలుసు కనుకా, వివాహ విషయంలో గాయత్రి తన నిశ్చితాభిప్రాయాలు ఏనాడో చెప్పింది కనుకా, గాయత్రి నజీర్‌తో పెళ్ళి విషయం తనకు చెబుతుందని గీత ఊహించింది. కాకపోతే ఇంత త్వరగా చెబుతుందని అనుకోలేదు. అందుకే అడిగింది - "బాగా ఆలోచించే ఈ నిశ్చయానికి వచ్చావా?" అని.

"ఆలోచించవలసిందేమీ లేదింక. నేనంటే అతనికి ప్రాణం. అతనంటే నాకు చాలా ఇష్టం. మా ఆలోచనలు, అభిలాషలు ఒక్కటిగానే వున్నాయి...."

"నువ్వు చెప్పినవన్నిటికీ ఒప్పుకుంటున్నాను. కానీ ఇంకా కొంచెం ముందుకు వెళ్ళి ఆలోచించాలనిపిస్తుంది నాకు" అన్నది గీత.

"అంటే మా అమ్మా నాన్న, నజీర్ తల్లిదండ్రులూ అంగీకరించటం గురించా?"

"అవును... అదికూడా ఒకటి..."

"ఆ విషయం మీద నేనూ, నజీరూ ఈ సాయంత్రం మాట్లాడుకున్నాం. నేను మా వాళ్ళను ఒప్పిస్తాను. నజీర్ తన వాళ్ళని అడుగుతానన్నాడు".

"నువ్వు పూర్తిగా శాకాహారివి. అంతేకాక జంతుజాలాల మీద ప్రేమవల్ల, వాటిని చంపి ఆహారం చేసుకోటానికి ఏ మాత్రం అంగీకరించని మనిషివి. నజీర్‌కి మాంసాహారం లేకపోతే ముద్ద దిగదు. మరి ఎలా సరిపెట్టుకుంటావు?"

నవ్వింది గాయత్రి. "ఎవరి అభిప్రాయాలు వాళ్లవి. అతనవి తినటంవల్ల నాకేమీ అభ్యంతరం లేదు. నేను మాత్రం తినను. ఇంట్లో అలాటివి వండం. నా కోసం అతను ఆ మాత్రం మారకపోడు!"

"అతని కోసం నువ్వు మారనప్పుడు, అతను నీ కోసం ఎలా మారతాడని అనుకుంటు న్నావ్?" సూటిగా అడిగింది గీత.

గాయత్రి ఒక్క క్షణం మాట్లాడలేదు. తర్వాత అన్నది - "మనసుంటే మార్గం వుండకపోదు.

ఇది అంత క్లిష్టమైన సమస్య అని అనుకోను''

అదోలా నవ్వింది గీత. కొంచెం సేపు ఆగి అన్నది - ''నేనేదో నీకు బొంబాయి సినిమా కథ చెబుతున్నాని అనుకోకు. మీరిద్దరూ రెండు మతాలకు చెందిన వాళ్ళు. మీరిద్దరూ కలిసి ఏ మతం పాటిస్తారు? మీకు పుట్టబోయే పిల్లలకు ఏ మతం సమ్మతం అవుతుంది?'' అడిగింది గీత.

''ఎవరి మతాలు వాళ్లకే సమ్మతం. నేను హిందువుగా పుట్టటం వల్లా, హిందూమతం మీద నమ్మకం, గౌరవం వుండటంవల్లా అదే నా మతం. నాకు పరమతాల మీద ద్వేషం లేకపోగా, గౌరవం కూడా వుంది. అలాగే నజీర్‌కి కూడా అని నా నమ్మకం''.

''నువ్వు చెప్పినంత సులభమైన విషయంకాదది గాయత్రీ! నేనేదో పురాతన భావాల మనిషిననుకోకు. నేనూ నీలాగానే అభ్యుదయభావాలు కలదాన్నే. కులమతాలమీద నమ్మకం లేనిదాన్ని. కానీ, ఇలాటి విషయాల్లో ఇంకా కొంచెం జాగ్రత్తగా ఆలోచించవలసిన అవసరం వుంది''.

నవ్వింది గాయత్రి - ''అమెరికాలో మా బాబాయి కూతురు ఏం చేసిందో తెలుసుకదా. సంధ్య ఒక క్రిస్టియన్ అమెరికన్ని పెళ్ళి చేసుకుంది. ముందు మా బాబాయి వాళ్ళు, వాళ్ళిద్దరికీ పెళ్ళి హిందూ పద్ధతిలో అక్కడ గుళ్లో జరిపించారు. తర్వాత వారం, క్రిస్టియన్ పద్ధతిలో చర్చిలో జరిపించారు. నాకు పెళ్ళి ఫొటోలు పంపించింది సంధ్య.

డేవిడ్ తెల్ల లాల్చీ, ధోవతీ కట్టుకుని, నుదుటి మీద బొట్టు, భాషికంతో గుళ్ళో పెళ్ళి చేసుకుంటూ చక్కగా వున్నాడు. అలాగే సంధ్య కూడా చర్చిలో తెల్లటి పెళ్లి గౌనులో, ముద్దొచ్చేట్టుగా వుంది.

''మూడేళ్ళనించీ వాళ్ళు, ముచ్చటగా కాపురాలు చేసుకుంటున్నారు. సంధ్యతో, అతను గుడికి వెడతాడు. డేవిడ్‌తో, సంధ్య చర్చికి వెడుతుంది. ఇద్దరూ చిలకా గోరింకల్లా వున్నారు''.

గీత అన్నది - ''వాళ్ళు అంత అన్యోన్యంగా వున్నందుకు నాకూ ఆనందంగానే వుంది. అంతేకాదు. ప్రపంచంలో అందరూ కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా అలా కలిసిపోతే భూలోకమే స్వర్గలోకమవుతుంది. కానీ మన దేశంలో, ముఖ్యంగా ఈ మతకలహాల రాజకీయపు రోజుల్లో, హిందూ ముస్లిమ్‌ల వివాహాలలో, అంత సామరస్యం వుంటుందని అనుకోను. నేను చూస్తున్న పరిధి తక్కువ కావచ్చును. కానీ నా ఆలోచనలు అసమంజసం కాదని నా అభిప్రాయం. మనం మతం పరంగా ఇంకా ఎదగలేదని నా ఉద్దేశ్యం. అంతేకాక, మీ పిల్లలు ఏ మతం పాటిస్తారు?''

నవ్వింది గాయత్రి.

"గీతా! నువ్వు మరీ అమ్మమ్మలాగా ఆలోచిస్తున్నావే. మా పిల్లలు పెరిగి, పెద్దవాళ్ళ య్యేలోగా ఈ కులాలు, మతాలు, అన్నీ పోతాయి తెలుసా?"

"అలా అని నేను అనుకోను. గాంధీగారు, ఈ కుల మత తారతమ్యాలు మరిచిపొమ్మనీ, అందరూ దేవుడి పిల్లలేననీ చెప్పి ఏభై ఏళ్ళు దాటింది. ఇప్పుడు మన రాజకీయ నాయకుల పుణ్యమా అని, ఆ బేధాలు బాగా ఎదిగిపోయాయి. అవే కాదు, కట్నాలు చూడు. ఈనాడు వున్నన్ని కట్నాల దాహాలు, మన పవిత్ర భారతంలో ఏనాడూ లేవు. ఆ మార్పు చదువుల వల్ల వచ్చేది కాదు. సంస్కారం వల్ల రావాలి. పెద్ద చదువులు చదివినవాళ్ళలోనే, సంస్కారాలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయి. మనం ఏమాత్రం ముందుకి పోవటం లేదు".

"అందుకే నేను కొంచెం ముందుకి వెడదామనుకుంటున్నాను. చూద్దాంఏమవుతుందో!" అన్నది గాయత్రి, పెద్దగా నవ్వుతూ.

★ ★ ★

రోజూలాగానే నజీర్ ఎప్పుడూ కూర్చునే ప్రదేశానికి వచ్చాడు. గాయత్రి అక్కడే కూర్చుని, ఏదో కథల పుస్తకం చదువుకుంటున్నది.

వచ్చి ఆమె పక్కనే కూర్చుని, "ఏమిటి దీర్ఘంగా చదువుతున్నావ్?" అని అడిగాడు నీజీర్.

"ఏదో కాలక్షేపం కోసం కథల పుస్తకం. ఏమైంది మనం అనుకున్న విషయం" అని అడిగింది.

"మీ వాళ్ళని ఒప్పిస్తాననే నమ్మకం వుందా నీకు?" అడిగాడు నజీర్, ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

చిరునవ్వు నవ్వింది గాయత్రి.

"మొన్ననే ఆ విషయం చెప్పాను నీకు. ఇది నా జీవితం. నా ఇష్టం. నా నిర్ణయాలకి నేనే బాధ్యత వహిస్తాను. నా నమ్మకాలకూ, ఆశయాలకూ, ఎదురుతిరిగేవాళ్లు, నా సుఖం కోరేవాళ్ళు కాదని నా ఉద్దేశ్యం. మా వాళ్ళు అంగీకరిస్తే మన వివాహం జరిపించి, అక్షింతలు వేస్తారు. ఇష్టం లేకపోతే, అక్షింతల బదులు చివాట్లు వేస్తారు. కానీ మన పెళ్ళి మాత్రం ఆపలేరు".

"నేను అంత తెగించలేనుకానీ, వాళ్ళను ఒప్పించగలననే నమ్మకం వుంది"

"అయితే నువ్వింకా మీ ఇంట్లో చెప్పలేదా?" అడిగింది గాయత్రి కొంచెం ఆశ్చర్యపోతూ.

"లేదు. చెబుతాను. మా అమ్మా నాన్నల భయం ఏమిటంటే, వేరే మతం వాళ్ళు మాలో

ఎలా కలిసి పోతారని? వాళ్ళు నిన్ను కోడలుగా స్వీకరించటానికి ఒకే ఒక మార్గం వుంది. నువ్వు ముస్లిమ్‌గా మారిపోతే, అది ఒక సమస్యే కాదు. గాయత్రి అన్న పేరు మార్చి, నీకిష్టమైన, అందమైన ముస్లిమ్ పేరు పెట్టుకో. అల్లా మీద నమ్మకం ఏర్పరుచుకో. వాళ్ళు ఇంక నోరెత్తరు. మనిద్దరం సుఖంగా వుండవచ్చు''.

అదిరిపడి చూసిందతన్ని గాయత్రి.

ఒక్కక్షణం తమాయించుకుని అన్నది -

''నేను మతం మార్చుకుంటే, నా వ్యక్తిత్వం మారుతుందా? నా భావాలు మారిపోతాయా? ఎవరి మతం వాళ్ళు పాటిస్తూ, ఎదుటివారి మతాన్ని గౌరవిస్తూ జీవించటం వల్ల తప్పేమిటి?''

''ఒక మతం వాళ్లకు ఇంకో మతం ఎ లా నచ్చుతుంది? అన్ని మతాలూ ఒకటి కాదు కదా?'' అన్నాడతను.

''ఏ మతమైనా చెప్పేది, మనుష్యులను మనుష్యులుగా బ్రతకమనీ, నీతీ న్యాయాలతో, ఎదుటి వాడికి సహాయం చేస్తూ జీవించమనేకదా! ఏ మత గ్రంథాలూ, పాపాలు చేయమని కానీ, అన్యాయంగా బ్రతకమని కానీ చెప్పటం లేదే? అలాంటప్పుడు, అవే నీతి సూత్రాలను చెప్పే ఇతర మతాలను గౌరవించటంలో తప్పేముంది?''

''అవన్నీ పుస్తకాల్లో చదవటానికి బాగుంటాయి కానీ, నిజ జీవితంలో జరగవు గాయత్రీ! నా మాట నమ్ము. నేను చెప్పినట్టు చేద్దాం. మన జీవితం సుఖంగా వుంటుంది'' - ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు నజీర్.

''నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా నజీర్?'' సూటిగా అడిగింది గాయత్రి.

''అవుననే కదా, ఇన్నాళ్ళ నుంచీ చెబుతున్నాను''.

''నాలో ఏం చూసి ప్రేమిస్తున్నావ్?''

''నీ అందం, నీ రూపం. అన్నిటికీ మించి, నీ మీద నీకు వున్న నమ్మకం. ఇందాక అన్నావే. నా జీవితం నా బాధ్యత అని, అది. ఎవరో ఎక్కడినించో వచ్చి ఉద్ధరిస్తారనుకోవటం, మన దేశంలో చాలామంది నమ్మే సిద్ధాంతం. అది నీలో లేదు. నీ మీద నీకు పూర్తి నమ్మకం వున్నప్పుడు, ప్రపంచాన్నే జయిస్తావు''

పకపకా నవ్వింది గాయత్రి. నవ్వుతున్నప్పుడు ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

''నజీర్! నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. ఇది నా జీవితం. నా ఇష్టం. నా బాధ్యత.

ఇందాక అన్నాను గుర్తుందా. నన్ను ఎంత ప్రేమించిన వాళ్ళయినా, నా భావాలను, ఆశయాలను గౌరవించనివాళ్లు, నా సుఖం కోరేవాళ్ళు కారని.

"నువ్వు, నన్ను నన్నుగా ప్రేమిస్తే, నన్ను పెళ్ళి చేసుకో, నాతోపాటూ, నా అభిప్రాయాలనీ గౌరవించు. నేనూ అలాగే చేస్తాను. నేను, నా రూపం, నా శరీరం కావాలి కానీ, నా భావాలూ, నా నమ్మకాలూ, నా మతం నీకు అఖ్ఖరలేకపోతే, నువ్వు నాకు అఖ్ఖరలేదు"

నజీర్ ఏమీ మాట్లాడలేదు.

కొన్ని నిమిషాలు గడిచాయి.

గాయత్రి అన్నది - "నీ జవాబు కోసం ఎదురు చూస్తున్నాను. నీ ఉద్దేశ్యం చెప్పు. దానిమీదే మన భవిష్యత్తు ఆధారపడి వుంది".

అతను ఆలోచిస్తూ, ఇసకలో గీతలు గీస్తున్నాడు.

గాయత్రి లేచి నుంచున్నది. అతనివైపు ఒకసారి చూసి, ఎదురుగా ఎత్తుగా దారిచూపిస్తున్న రోడ్డుకేసి, చకచకా నడిచింది. ●

*(స్వాతి సపరివార పత్రిక: జూన్ 26, 1998)*